# కుండ మోసికొని పోవుచున్న వ్యక్తి

దేవుని పరిశుద్ధ నామమునకు మహిమ కలుగును గాక ! ఆమేన్ ఆమేన్ ఆమేన్

**<u>మూలవాక్యము</u>:– లూకా 22:9,10**

వారు – మేమెక్కడ సిద్ధపరచగోరుచున్నావని ఆయనను అడుగగా। – ఆయన – ఇదిగో మీరు పట్టణములో ప్రవేశించు నప్పుడు <u>నీళ్లకుండ</u> <u>మోసికొనిపోవుచున్న</u> <u>యొకడు</u> మీకు ఎదురుగా వచ్చును; అతను ప్రవేశించు ఇంటిలోనికి అతని వెంటవెళ్లి!

**<u>వివరణ</u>:–** ప్రభువైన యేసుక్రీస్తువారు ఏ పనినిమిత్తము, తండ్రిచేత ఈ లోకానికి పంపబడినారో ఆ పని పూర్తిచేసే రోజుల లోకి వచ్చేసారు. పస్కా బలిపశువుగా వచ్చిన ప్రభువు ఈ లోకంలో చిట్టచివరి పస్కాపండుగను ఆచరించబోతున్నారు. ఇప్పుడు ప్రభువైన యేసుక్రీస్తువారు ప్రాముఖ్యమైన పస్కాపండుగ ఆచరించడానికి శిష్యులతో కలిసి పస్కాను భుజించడానికి ఒక స్థలము కావాలి. ఎక్కడ సిద్ధపరచాలి అని శిష్యులు ప్రభువుని అడిగినప్పుడు ప్రభువైన యేసుక్రీస్తువారు ఒక వ్యక్తిని పరిచయం చేస్తున్నారు. ఆ వ్యక్తి జీవితంలోకి తొంగి చూసే ప్రయత్నమే ఈ అంశము.

దేవుని ప్రణాళిక చాలా గొప్పది. ఆయన తలంపులు ఉన్నతమైనవి. మనుష్యుల హృదయమునకు గోచరము కావు (1కొరింథీ 2:9 ). యేసుక్రీస్తు వారు ప్రత్యక్షంగా కాని పరోక్షంగా గాని చాలామందిని పరిచయం చేసారు. పరిచయము చేసిన ప్రతివ్యక్తి జీవితంలో కొన్ని మంచి లక్షణాలు వున్నాయి. వారిజీవితం నుంచి మనము చాలా విషయాలు నేర్చుకోవచ్చు ,అవి మనము ఆత్మీయముగా అభివృద్ధి చెందటానికి ఎంతగానో సహాయపడతాయి.

**<u>ఇంతకీ ఎవరు ఆ వ్యక్తి</u>:–** నీళ్ల కుండ మోసికొనిపోవుచున్న వ్యక్తి. ఈ వ్యక్తిని జీవితాన్ని బాగా పరిశీలిస్తే మనకు ఎలియాజరు గుర్తు వస్తారు. ఎలియాజరు తన యజమానునికి (ఇస్సాకు) మరియు రిబ్కాకి మధ్యవర్తిగా వ్యవహరిస్తాడు. ఇక్కడ కూడ ఈ వ్యక్తి శిష్యులకు తన యజమానుని ఇల్లుని మరియు యజమానుని పరిచమయం చేస్తున్నాడు, అయితే ఇతని ప్రత్యేకత ఏమిటంటే ఒక్క మాట కూడ మాట్లాడకుండా ఆ పని చేసినారు.

**<u>ఈ వ్యక్తిలోని లక్షణములు గమనించుదాం:–</u>**

**1) మంచి పనివాడు**: అవును అతను నిజముగా మంచి పనివాడు అని సాక్ష్యమివ్వాలి. అతడు పట్టణములో వుండే యజమానుని దగ్గర పని చేస్తున్నాడు. అంటే ఆ యజమానుడు ధనవంతుడు అయ్యివుండాలి. చాలా పనులు వుంటాయి అలాంటి యజమానుని దగ్గర పనిచేస్తుంటే ఖచ్చితముగా అతను మంచి పనివాడు అయివుండాలి.

**2) దేవుని ప్రణాళికలో వుండి ఆ పని పూర్తి చేసినవాడు**: నిజముగా ఇతను దేవుని గొప్ప ప్రణాళికలో వున్నాడు. ప్రభువు శిష్యులు ప్రపంచం మొత్తానికి దారిచూపే వారిగా వుంటే అలాంటి శిష్యులకు దారి చూపే వ్యక్తిగా ఇతనిని మనము చూడ వచ్చు. మనలో చాలా మందికి ఒక ఆశ వుంటుంది. మనము యేసుక్రీస్తు వారి కాలములో పుట్టివుంటే ప్రభువు పాదాలు కడిగే వాడిని. ఆయనను వెంబడించే వాడిని, ఆయన కొరకు ప్రాణము పెట్టే వాడిని అని చెప్పుకుంటాము కాని నిజముగా పుట్టి వుంటే చేస్తామో లేదో తెలీదు. కాని ప్రభువు పస్కాను సిద్ధపరచడానికి ఎక గది కావాలి ఆ గదికి దారి చూపే ఒక గొప్ప ప్రణాళికలో అతను వున్నాడు.

**3) శిష్యులను మేడగదికి నడిపించిన వ్యక్తి:** శిష్యులకు యజమానుని మేడ గది చూపించినాడు.నీళ్లు వాక్యమునకు సాదృశ్యం కుండ మన ఆత్మీయ స్థితికి సాదృశ్యం. ఎవరైతే వాక్యముతో నిండి వుంటారో వాక్యానుసారముగా జీవిస్తారో వారు మాత్రమే దేవునుని అనగా యజమానుని చూపించ గలరు అనే సత్యాన్ని మనము గ్రహించాలి.

**4) నిశ్శబ్దంగా పనిచేసిన వ్యక్తి:** ఇతను నిశ్శబ్దసేవకు ఒక మంచి నిదర్శనం. సహజముగా పట్టణములలో వుండే వారికి అందరిని పలకరించే అలవాటు వుంటుంది. కాని ఇతను మాత్రం ఎవరితోను మాట్లాడకుండ తన పని తాను చేస్తున్నాడు.

**5) పనిమీద మాత్రమే దృష్టిపెట్టేవాడు:** ఇతను యజమానుని పని మరియు ప్రభువు పని ఒకే సారి చేసాడు.

**హెచ్చరిక:** దేవుని పని చేయాలనుకున్న నీవు ఎలాగు చేయాలనుకుంటున్నావు. నిన్ను నీవు గొప్పగా చెప్పుకుంటున్నావా? నిశ్శబ్ద సేవకు మంచి నిదర్శనం ఈ వ్యక్తి. నీవు ఈ లెంట్‌లో నిన్ను నీవు గొప్ప చేసుకోవటం మాని దేవుని చూపించటం ప్రారంభించు..................దేవుడు మిమ్మును నిశ్శబ్ద సేవకులనుగా చేయును గాక ! ఆమేన్ ఆమేన్.

***గమనిక:*** *అతనిని దేవుడు ఎంత నిశ్శబ్దంగా వుంచినారు అంటే అతని పేరు కూడా ప్రస్తావించలేదు. జాగ్రత్త నీ పేరు గొప్ప చేసుకోకు. నిన్ను సిలువ చాటున మరుగు చేసుకో. దేవుని పని నమ్మకముగా చేయి.అట్టి కృప పరిశుద్ధాత్మ దేవుడు మనకు దయచేయును గాక! ఆమేన్ ఆమేన్ ఆమేన్.*